నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
03 సెప్టెంబర్ 2024
పేజీలు: 02



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
# 10 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గంటల తరబడి భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు హతమయ్యారు. మరోవైపు ఎన్‌కౌంటర్ స్థలం నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ-బీజాపూర్ జిల్లా సరిహద్దులోని లోహగావ్ పెడియా అడవుల్లో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.

ఈ ఎన్‌కౌంటర్‌లో 10 మంది నక్సలైట్లు హతమైనట్లు వార్తలు వస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. పోలీసుల నుంచి అందిన సమాచారం ప్రకారం.. నక్సలైట్లకు చెందిన పీఎల్ జీఏ కంపెనీ నంబర్ 2తో సైనికులకు మధ్య ఎన్ కౌంటర్ జరిగింది. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 10 మంది నక్సలైట్లను భద్రతా దళాలు హతమార్చారు. ఘటనా స్థలం నుంచి నక్సలైట్ల మృతదేహాలతోపాటు ఎస్‌ఎల్‌ఆర్, 303, 12 బోర్ ఆయుధాలు కూడా లభ్యమయ్యాయి. ఈ విషయాన్ని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా దళాలు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. మరోవైపు గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఆపరేషన్ పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక చనిపోయిన మావోయిస్టులకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.మొత్తంగా... మావోయిస్టుల ఏరివేతను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కేంద్ర సర్కారు.. మరిన్ని బలగాలతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో వరుస కూంబింగులు చేపడుతోంది. కేంద్ర బలగాలనూ రంగంలోకి దించుతోంది. మూకుమ్మడి దాడులు చేయడంలో సిద్ధహస్తులైన బ్లాక్ క్యాట్స్‌ను సైతం మావోయిస్టుల ఏరివేతలో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది.



## తెలంగాణ వరదలు.. రూ.100 కోట్ల విరాళం!

వరద బాధితుల కోసం ఒకరోజు బేసిక్ పేని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షన్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఒకరోజు బేసిక్ పేను సెప్టెంబర్ నెల జీతం నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపింది. ఈ మొత్తం రూ.100 కోట్లు ఉంటుందని సమాచారం.



## మూడో రోజు జలదిగ్బంధంలో ఏడు పాయల వనదుర్గ ఆలయం

మూడో రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో మెదక్‌లోని ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. మంజీరా బ్యారేజ్ గేట్లు ఓపెన్ చేయడంతో ఏ క్షణాన అయిన భారీ వరద వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అమ్మవారి ఆలయం చుట్టూ మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. అమ్మవారి పాదాలను తాకుతూ ఏడు పాయలుగా చీలిపోయి ఆలయం ఎదుట పరవళ్లు తొక్కుతుంది.గర్భగుడి మూసేయడంతో రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి అమ్మవారు పూజలు అందుకుంటున్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత యధావిధిగా భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో తెలిపారు. ఇక.. మంజీరాకు నక్క వాగు వరద చేరడంతో వనదుర్గ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి 13 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. వరదల కారణంగా మంజీరాలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.




## హైడ్రా ఎఫెక్ట్.. భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు!

హైడ్రాతో జనంలో భయాందోళనలు.. గత నెలతో పోలిస్తే రూ.320 కోట్ల మేర ఆదాయం తగ్గిపోయింది. హైడ్రా కూల్చివేతల ప్రభావం రిజిస్ట్రేషన్ల శాఖపై చూపిస్తుంది. జూలై నెలతో పోలిస్తే భారీగా తగ్గిపోయిన రిజిస్ట్రేషన్లు. జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్గిరి, సంగారెడ్డిలో 58,000 రిజిస్ట్రేషన్లు అయ్యాయి.. ఆగస్టులో 41,200 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. జూలైలో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయం రూ.1105 కోట్ల ఆదాయం రాగా, ఆగస్టులో రూ.320 కోట్ల మేర ఆదాయం తగ్గి రూ.785 కోట్లకి పడిపోయింది.



## విజయవాడలో పాల కొరత.. అర లీటర్ రూ.80

వరదల్లో మునిగిపోయిన విజయవాడలో పాల కొరత తీవ్రమైంది. ఇదే అదునుగా వ్యాపారులు రేట్లు పెంచేశారు. అరలీటర్ ప్యాకెట్ రూ.70-80 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్లలో పిల్లలు ఉన్నారని, కనీసం ఒక్క ప్యాకెట్టైనా ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. విజయ డెయిరీ, కృష్ణ మిల్క్ యూనియన్ సెంట్రల్ ఆఫీస్ మునిగిపోవడంతో లక్షల లీటర్ల పాలు, పెరుగు ప్యాకెట్లు చెడిపోయాయి. దీంతో సమస్య పెరిగింది.



## ఎల్లుండి మరో అల్పపీడనం!

ఈనెల 5న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. 6వ తేదీన అది వాయుగుండంగా మారుతుందని అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 6, 7 తేదీల్లో ప.గో, ఏలూరు, ఎన్టీఆర్ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తా యని పేర్కొంది. తెలంగాణలోనూ రాబోయే 5రోజు లు వర్షాలు పడతాయని తెలిపింది. అల్పపీడనం ప్రభావంపై నేడు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలిపింది.



## స్టన్నింగ్ లుక్‌లో పూజా హెగ్డే

బుట్టబొమ్మ పూజా హెగ్డే స్టన్నింగ్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. సూర్యాస్తమయం సమయంలో ఎంజాయ్ చేస్తున్న ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ముంబై బ్యూటీ పూజా హెగ్డే తెలుగులో పలు బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో నటించింది. స్టార్ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కొద్ది కాలం పాటు పలువురు స్టార్ హీరోల సరసన నటించి ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ మీద ఫోకస్ పెట్టింది.సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే పూజా, తాజాగా గ్లామరస్ ఫోటోలను అభిమానులతో పంచుకుంది.తాజాగా సూర్యాస్తమయం సమయంలో బీచులో విహరిస్తూ ఎంజాయ్ చేసింది.వన్ పీస్ డ్రెస్ లో అందాల కనువిందు చేస్తూ ఆహా అనిపించింది.

## వరద బాధితులకు భారీ విరాళం ప్రకటించిన ఎన్టీఆర్

### విశ్వక్ సేన్ కూడా..



తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్సం కొనసాగుతున్న విషయం తెలిసిందే. జనజీవనం అస్తవ్యస్తమైంది. కాలువలు, చెరువులకు గండిపడ్డాయి. వరదబారిన ప్రజలు ఆకలిదప్పలతో అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో వరద బాధితులకు సాయం అందించేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు కదిలివస్తున్నారు. వర్షాలు, వరదలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాలకు హీరో జూనియర్ ఎన్టీఆర్ తనవంతుగా విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలకు చెరో 50 లక్షల చొప్పున మొత్తం కోటి రూపాయల విరాళాన్ని జూనియర్ ఎన్టీఆర్ ప్రకటించారు. వరద విపత్తు నుంచి ఉపశమనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకొనే చర్యలకు సహాయపడాలని తన వంతుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరొక రూ.50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నట్లు తారక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరుగుతున్న వరద భీభత్సం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు. అతి త్వరగా ఈ విపత్తు నుండి తెలుగు ప్రజలు కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎన్టీఆర్ పేర్కొన్నారు.వరద బాధితుల సహాయార్థం విరాళం ప్రకటించిన తొలి హీరో ఎన్టీఆర్. దీంతో ఆయన్ను అభిమానులు, నెటిజన్స్ ప్రశంసిస్తున్నారు. తారక్ బాటలో మరికొందరు యువ హీరోలు పయనిస్తున్నారు. ఎన్టీఆర్‌ను బాగా లైక్ చేసే విశ్వక్‌సేన్ సైతం ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కి 5 లక్షలు విరాళం ప్రకటించారు.

## హర్యానాలో రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి




హర్యానాలోని జింద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, 8 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నర్వానాలోని బిధరానా గ్రామ సమీపంలో హిసార్-చండీగఢ్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కురుక్షేత్రలోని మార్చేడి గ్రామం నుంచి రాజస్థాన్‌లోని గోగమేడికి వెళ్తున్న టాటా ఏస్‌ను వెనుక నుంచి వచ్చిన ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మీడియాకు అందిన సమాచారం ప్రకారం మార్చేడి గ్రామానికి చెందిన 15 మంది రాజస్థాన్‌లోని గోగమేడికి టాటా కారులో వెళుతున్నారు. వీరి వాహనం నర్వానాలోని బిధరానా గ్రామం సమీపంలోకి చేరుకున్న సమయంలో హిసార్-చండీగఢ్ జాతీయ రహదారిపై బిధరానా- సిమ్లా మధ్య కలపతో కూడిన ట్రక్కు.. టాటా కారును వెనుక నుండి ఢీకొంది. దీంతో టాటా కారు ఒక గుంతలో బోల్తా పడింది. ఆ సమయంలో హైవే మీదుగా వెళుతున్న కొందరు డ్రైవర్లు బాధితులకు సహాయం అందించారు. అనంతరం నర్వాణ పోలీసులు ఏడు అంబులెన్సులను సంఘటనా స్థలానికి పంపారు. బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




## తొక్కిసలాటలో 129 మంది ఖైదీలు మృతి

కాంగో దేశంలోని మకాల జైలు నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన 129 మంది ఖైదీలు తొక్కిసలాటలో చనిపోయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరో 59 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. అడ్మినిస్ట్రేషన్ భవనం దెబ్బతినిందని పేర్కొంది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వెల్లడించింది. అయితే తమకు బయట నుంచి కాల్పుల శబ్దాలు వినిపించాయని కొందరు ఖైదీలు చెబుతున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



## పొంచి ఉన్న మరో తీవ్ర ప్రమాదం..

ఆంధ్ర, తెలంగాణలో భారీ వర్షాలు, వరదలు కాస్త తగ్గుముఖం పడుతున్నాయి. పునరావాస కేంద్రాల నుంచి ప్రజలు సొంతిళ్లకు చేరుకుంటున్నారు. అయితే ఇప్పుడు మరో తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. వరదలు తెచ్చిన బురద, చెత్తాచెదారంతో దోమలు విజృంభించనున్నాయి. వీటి వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్లు పెరగనున్నాయి. వీటిని అరికట్టడంపై ప్రభుత్వ విభాగాలు దృష్టిసారించాల్సి ఉంది. లేదంటే ఆరోగ్య విపత్తు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.



## నేడు 11 జిల్లాల్లో భారీ వర్షాలు

తెలంగాణలోని 11 జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురుస్తాయని, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేట, సంగారెడ్డి, పెద్దపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించిందని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని సూచించారు.

## 72 ఏళ్ల బామ్మ అకౌంట్ నుంచి రూ.72 లక్షలు కాజేశారు

ఆర్‌బీఐ, సీబీఐ పేర్లు చెప్పి ఆర్థిక మోసాలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి మోసానికి గురై కేరళకు చెందిన 72 ఏళ్ల బామ్మ రూ.72 లక్షలు మోసపోయింది. ఆర్‌బీఐ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకొని క్రెడిట్ కార్డ్ బ్లాక్ అయిందని ఒకరు, సీబీఐ అని చెప్పి మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ మరొకరు ఫోన్ చేసి ఆమెను భయపెట్టారు. ఈ క్రమంలో బామ్మ బ్యాంక్ వివరాలు సేకరించిన కేటుగాళ్లు ఆమె అకౌంట్లోని రూ.72 లక్షలు కాజేశారు.

## గోవుల స్మగ్లర్ అనుకుని.. 30 కిలోమీటర్లు ఛేజ్ చేసి..

# విద్యార్థిని కాల్చి చంపారు

హర్యానాలోని ఫరీదాబాద్‌లో 12వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గో సంరక్షకులు కాల్చి చంపారు. గోవులను స్మగ్లింగ్ చేస్తున్నాడన్న ఆరోపణలపై ఆ స్టూడెంట్‌పై అటాక్ చేశారు. ఆగస్టు 23వ తేదీన జరిగిన ఈ ఘటనలో గోసంరక్షణ గ్రూపునకు చెందిన అయిదుగుర్ని అరెస్టు చేశారు. నిందితులను అనిల్ కౌశిక్, వరున్, కృష్ణ, ఆదేశ్, సౌరభ్‌గా గుర్తించారు. బాధితుడిని ఆర్యన్ మిశ్రాగా గుర్తించారు. మిత్రులు శాంకీ, హర్షిత్‌తో వెళ్తున్న ఆర్యన్‌ను గోవులను స్మగ్లింగ్ చేసే వ్యక్తులుగా భావించి నిందితులు వెంటబడ్డారు. సుమారు 30 కిలోమీటర్ల దూరం కారులో ఛేజ్ చేశారు. హర్యానాలోని ఢిల్లీ-ఆగ్రా హైవేపై ఈ ఘటన జరిగింది. రెనాల్ట్ డస్టర్, టొయోటా ఫార్చ్యూనర్‌లో కొందరు ఆవులను స్మగ్లింగ్ చేసేవాళ్లు రెక్కీ వేస్తున్నట్లు గో సంరక్షకులకు సమాచారం అందింది. స్మగ్లర్ల కోసం వెతుకుతున్న సమయంలో.. విద్యార్థులు ప్రయాణిస్తున్న డస్టర్ కారును పటేల్ చౌక్ వద్ద గుర్తించారు. డ్రైవర్ సీటులో ఉన్న హర్షిత్ కారును ఆపలేదు. అయితే నిందితులు ఆ సమయంలో కాల్పులు జరిపాడు. ముందు సీటులో కూర్చున్న ఆర్యన్‌కు బుల్లెట్ తగిలింది. కారు ఆగిన తర్వాత కూడా ఆర్యన్‌ను మరోసారి నిందితులు షూట్ చేశారు. కారులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు గుర్తించిన నిందితులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆర్యన్‌ను ఆస్పత్రిగా తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. నిందితులు వాడిన వెపన్ అక్రమమైందని తేలింది. ప్రస్తుతం వాళ్లు పోలీసు కస్టడీలో ఉన్నారు. దర్యాప్తును కొనసాగిస్తున్నారు.





## బ్రూనై పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ

ప్రధాని మోదీ ఈ రోజు ఉదయం బ్రూనై పర్యటనకు బయలుదేరారు. భారత ప్రధాని బ్రూనై పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. బ్రూనై పర్యటన తర్వాత అక్కడి నుంచి మోదీ సింగపూర్ వెళతారు. సింగపూర్‌లో ప్రధాని సెప్టెంబర్ 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వోంగ్‌తో పలు కీలక అంశాలపై చర్చలు జరుపుతారు. బ్రూనై పర్యటనకు బయలుదేరే ముందు ప్రధాని 'ఎక్స్'లో ఒక ట్వీట్ చేశారు. బ్రూనై, సింగపూర్‌లతో భారత్ సంబంధాలు బలోపేతమవడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని తెలిపారు.

## షేక్ హసీనాపై మరో 5 హత్య కేసులు నమోదు

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసులు నమోదవుతూనే ఉన్నాయి. తాజాగా ఆమెపై మరో ఐదు హత్య కేసులు నమోదయ్యాయి. హసీనాతోపాటు మాజీ మంత్రులు, అనుచరులపై ఈ కేసులు నమోదైనట్లు స్థానిక మీడియా నివేదించింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా యువత ఆందోళనల నేపథ్యంలో దేశం విడిచి వెళ్లిన మాజీ ప్రధాని హసీనా.. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే ఆ అల్లర్ల సమయంలో ఐదుగురిని చంపినందుకు పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా, ఆమె కేబినెట్‌లోని మాజీ మంత్రులపై ఈ హత్య కేసులు నమోదైనట్లు సదరు మీడియా వెల్లడించింది. దీంతో ఇప్పటి వరకూ హసీనాపై నమోదైన కేసుల సంఖ్య 89కి పెరిగింది. ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారడంతో.. ప్రజా ఉద్యమానికి జడసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్రాణాలను దక్కించుకునేందుకు సోదరితో కలిసి దేశం వీడారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా దేశం వీడిన తర్వాత రాజకీయ అస్థిర పరిస్థితుల మధ్య బంగ్లాదేశ్‌లో నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే.




## భారత జట్టుకు సూర్య దూరం?

బుచ్చిబాబు టోర్నమెంట్ ఆడుతూ గాయపడ్డ భారత ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ దులీప్ ట్రోఫీ ఓపెనింగ్ రౌండ్‌కు దూరమవనున్నారు. సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం అయ్యే ఈ ట్రోఫీలో ప్రదర్శనల ఆధారంగా బంగ్లాదేశ్ టెస్ట్ సిరీస్‌కు జట్టును బీసీసీఐ ఎంపిక చేయనుంది. సీనియర్లు కాక భారత జట్టులో చోటు ఆశిస్తున్న వారు ఈ ట్రోఫీ ఆడుతున్నారు. దీంతో సూర్యకుమార్ యాదవ్ భారత జట్టుకు దూరమయ్యే ఛాన్సుంది. సెప్టెంబర్ 19 నుంచి బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది.









## దీపికా మెటర్నిటీ ఫోటోషూట్..

బాలీవుడ్ నటి దీపికా పదుకునే.. మెటర్నిటీ ఫోటోషూట్‌లో పాల్గొన్నది. గర్భంతో దిగిన ఫోటోలను ఆమె తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది. కొన్ని ఫోటోల్లో తన భర్త రణ్‌వీర్ సింగ్‌తో కూడా ఆమె ఫోటోలు దిగింది. ఆ ఫోటోలకు ఆమె ఎమోజీలను పోస్టు చేసింది. దిష్టితగలకుండా కంటి ఎమోజీతో పాటు ఇన్‌ఫినీటీ ఎమోజీని పోస్టు చేసింది. ఇక ఆమె ఫ్యాన్స్ నుంచి ఆ పోస్టుకు ఫుల్ లైక్స్ వస్తున్నాయి. అభిమానులు, స్నేహితులు, కుటుంబీకులు, తోటివారు.. ఇన్‌స్టా పోస్టుకు రియాక్ట్ అవుతున్నారు. హాలీవుడ్ హీరో విన్ డీజిల్ కూడా దీపికా ఇన్‌స్టా పోస్టుకు లైక్ కొట్టేశాడు. కామెంట్ సెక్షన్‌లో అతను చేతులు జోడించి ఉన్న ఎమోజీతో రిప్లై ఇచ్చాడు. బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా.. హార్ట్‌తో పాటు ఫైర్ ఎమోజీలను పోస్టు చేసింది. కత్రినా కైఫ్ కూడా హార్ట్ ఎమోజీలను పోస్టు చేసింది.



## బికినీలో భోజ్‌పురి నటి నమ్రత

నమ్రత మల్లా భోజ్‌పురి నటి. నమ్రత ప్రతిరోజూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఫోటోలు మరియు వీడియోలను పోస్ట్ చేస్తూనే ఉంటుంది. నమ్రత చాలా ఆకర్షణీయమైన నటీమణులలో ఒకరు.అభిమానులు నమ్రతను ప్రేమిస్తారు. నటి ఇటీవల చిత్రాలను పంచుకుంది. ఈ చిత్రాలలో, నమ్రత బికినీలో కనిపించింది. నమ్రత యొక్క ఈ చిత్రాలు సోషల్ మీడియాలో చాలా సందడి చేస్తున్నాయి.భోజ్‌పురి నటి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను అప్‌డేట్ చేస్తున్నప్పుడు ఈ చిత్రాలను షేర్ చేసింది. నమ్రతకు కూడా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.